సాక్షి
అనకాపల్లి

శుక్రవారం । 5 । జనవరి । 2024



శాస్త్రోక్తంగా చండీ హోమం

విశాఖ: బహుళ అష్టమి సందర్భంగా గురువారం లలితానగర్ లలితా పీఠంలో వేద పండితులు శాస్త్రోక్తంగా చండీ హోమం నిర్వహించారు.



అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం జరిపారు.



కథా నాటిక పోటీలు

విశాఖ: అజో–విభో–కందాళం, రైటర్స్ అకాడమీ నిర్వహిస్తున్న కథా నాటిక పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి.

న్యూస్‌రీల్

ఇచ్చిన మాట ప్రకారం..



దేవరాపల్లిలో డిప్యూటీ సీఎం బూడి సమక్షంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పింఛన్‌దారులు 8లో

రసూల్ డెకర్ పరిశ్రమలో ప్రమాదం

- మధ్యప్రదేశ్‌కు చెందిన కార్మికుడి మృతి



మనీష్ ప్రజాపతి మృతదేహం

రాంబిల్లి: సెజ్‌లో రసూల్ డెకర్ పరిశ్రమలో గురువారం జరిగిన ప్రమాదంలో మధ్యప్రదేశ్‌కు చెందిన మనీష్ ప్రజాపతి (32) మృతి చెందినట్లు ఎస్‌ఐ దీనబంధు తెలిపారు. విధి నిర్వహణలో వున్న మనీష్ ప్రజాపతి చేయిని బెల్టు లాగేయడంతో రోలర్ కింద పడి తీవ్ర రక్తస్రావం జరిగిందని ఎస్‌ఐ తెలిపారు. తీవ్రంగా గాయపడిన మనీష్‌ను విశాఖపట్నం కిమ్స్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. సరైన భద్రత ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఇటువంటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నామని ఆరోపించారు.

సొంతింటి కల సాకారం



లబ్ధిదారునికి ఇంటి తాళం, ఇంటి పత్రాలు అందిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, మంత్రి అమర్‌నాథ్



టిడ్కో గృహాన్ని ప్రారంభిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి



సభకు హాజరైన లబ్ధిదారులు

- టిడ్కో ఇళ్లలో సామూహిక గృహప్రవేశాలు
- అనకాపల్లిలో సామాన్యుల ఆనందహేల

అనకాపల్లి: పేదవాడి సొంతింట కల నిజం చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. సత్యనారాయణపురం గ్రామంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధ్యక్షతన గురువారం జరిగిన కార్యక్రమంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో కలిసి ఆయన 2,744 టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేశారు. వారితో గృహప్రవేశాలు చేయించారు. ఈ సందర్భంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అనంతరం మాట్లాడుతూ.. దేశంలో మరే రాష్ట్రంలో అమలు కాని సంక్షేమ పథకాలు అందిస్తూ రాష్ట్ర ప్రజల హృదయాల్లో సీఎం జగన్ సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారని పేర్కొన్నారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ టిడ్కో గృహాలు పేదవారికి సంక్రాంతి కానుకగా అందజేస్తున్నామని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్పయాత్రలో సామాన్యుల అవస్థలు చూసి, అధికారంలోకి వచ్చిన వెంటనే టిడ్కో గృహాలను తక్కువ మొత్తానికి అందించాలని నిర్ణయించుకున్నారని, ఇప్పుడు కచ్చితంగా అమలు చేశారన్నారు. 300 గజాల ఇళ్లను కేవలం రూపాయికే అందించారన్నారు. ఇళ్ల రిజిస్ట్రేషన్ ఖర్చులను కూడా ప్రభుత్వమే భరించిందని చెప్పారు. గత ప్రభుత్వం ఎన్నికల ముందు హడావుడిగా ఇళ్లు నిర్మించి ఎటువంటి మౌలిక సదుపాయాలు లేకుండా లబ్ధిదారులకు అంటకట్టాలని చూసిందని విమర్శించారు. ఈ గ్రామంలో త్వరలో పాఠశాల, వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. టీటీడీ కల్యాణమండపాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. తుమ్మపాల, జగన్నాథపురం, పిసినికాడ, కోడూరు, మామిడిపాలెం గ్రామాల్లో జగనన్న కాలనీల్లో 6 వేల మందికి సెంటు భూమిలో ఇళ్లు నిర్మించి ఇచ్చామన్నారు. ఎంపీ బీవీ సత్యవతి మాట్లాడుతూ రాష్ట్రంలో అతి పెద్ద టిడ్కో కాలనీ తన పార్లమెంట్ స్థానంలో ఉండడం గర్వంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ మాట్లాడుతూ సీఎం చేసిన మేలుకు రాబోయే ఎన్నికల్లో లబ్ధిదారులు రుణం తీర్చుకోవాలని సూచించారు. టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, పెందుర్తి ఎమ్మెల్యే అదీప్ రాజు, ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, కశింకోట జెడ్పీటీసీ దంతులూరి శ్రీధర్‌రాజు, జీవీఎంసీ ఏడీసీ యాదగిరి శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ బాపునాయుడు, ఆర్డీవో చిన్నికృష్ణ, జెడ్పీ వెంకటరమణ పాల్గొన్నారు.జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, కార్పొరేటర్లు మందపాటి సునీత, పీలా లక్ష్మీసౌజన్య, పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు పాల్గొన్నారు.

ఎంతో ఆనందంగా ఉంది



టిడ్కో గృహాలు అందించడంతో నాకెంతో సంతోషంగా ఉంది. గత ప్రభుత్వ హయాంలో రుణ చెల్లింపులు వరుసగా ఉంటాయనడంతో రుణభారం ఎక్కువగా ఉంటుందనే ఆందోళన ఉండేది. ప్రస్తుత ప్రభుత్వం రూపాయికే ఇంటిని అప్పగించడం ఆనందంగా ఉంది.

– బుగిడి నూక అప్పారావు, లబ్ధిదారుడు, రామాపురం కాలనీ

కల నెరవేరింది..



నాకంటూ ఏమీ లేదు. గత ప్రభుత్వంలో టిడ్కో గృహాలు మంజూరు చేస్తామని, బ్యాంకుకు రుణం చెల్లించాలని చెప్పారు. అప్పట్లో డీడీ కూడా తీయించారు. నెల నెలా బ్యాంకుకు రుణం చెల్లించాలని చెప్పడంతో రుణభారం ఎక్కువవుతుందనే భయం ఉండేది. ప్రస్తుతం ఇంటిని అందించడం నాకెంతో ఆనందాన్నిచ్చింది.

–వై.సాయిబాబా, గాంధీనగరం, అనకాపల్లి

అంధుల రక్తదానం



రక్తదానం చేసిన అంధులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న డాక్టర్ రామ్మూర్తి, హిమజ

తుమ్మపాల: చూపులేని అంధులు తోటివారి ప్రాణం నిలిపేందుకు రక్తదానం చేయడం అద్భుతమని, సమాజం కోసం వారు కూడా ముందుకు రావడం వారి సేవాభావానికి నిదర్శనమని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ చైర్మన్ డాక్టర్ రామ్మూర్తి అన్నారు. ఏఎంఏఎల్ కళాశాలలో 'మేము సైతం సమాజం కోసం' సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం మెగా రక్తదాన కార్యక్రమం జరిగింది.

ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ రామ్మూర్తి మాట్లాడుతూ ఒకరి సహాయం లేకుండా అనేక ఉద్యోగాలు, వృత్తులలో ప్రతిభ చూపించి సమాజానికి తామేంటో చూపిస్తున్న అంధులు రక్తదానం చేయడం ప్రశంసనీయమన్నారు. వైస్ చైర్మన్ డాక్టర్ హిమజ మాట్లాడుతూ భవిష్యత్తులో 'మేము సైతం' లాంటి సంస్థలు చేపట్టే కార్యక్రమాలలో తాము కూడా పాల్గొంటామన్నారు. అంతకుముందు కరస్పాండెంట్ శ్రీనివాసరావు, వర్తక సంఘం గౌరవ అధ్యక్షుడు కొణతాల లక్ష్మీనారాయణ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రామ్మూర్తితో కలిసి దాతలకు ప్రశంసా పత్రాలు అందించారు. మొత్తం 125 మంది రక్తదానం చేసినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ జి.జయబాబు తెలిపారు. రెడ్‌క్రాస్ లైఫ్ సభ్యులు డాక్టర్ దేవరాజ్, కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు నృసింహ దీక్షల విరమణ

సింహాచలం : శ్రీ నృసింహ దీక్షల విరమణ కార్యక్రమాన్ని శనివారం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి గురువారం తెలిపారు. 41 రోజుల మండల దీక్ష, 32 రోజుల దీక్ష తీసుకున్న వారంతా శనివారం దీక్ష విరమింపజేయాలని తెలిపారు.

సీఐ, ఎస్‌ఐలకు బదిలీలు

విశాఖ పోలీస్ రేంజిలో బదిలీలు జరిగాయి. 20మంది సీఐలు, 34మంది ఎస్‌ఐలకు స్థానచలనం కలిగింది. 12లో

పండగలా ప్రారంభోత్సవాలు



కొరువాడలో మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు



సంగన్నదొరపాలెంలో హెల్త్ వెల్‌నెస్ భవనం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

- రూ.10.27 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు శ్రీకారం
- పది గ్రామాల్లో అట్టహాసంగా ప్రారంభించిన డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

కె.కోటపాడు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి వెలుగులతో గ్రామాలు కళకళలాడుతున్నాయని డిప్యూటీ సీఎం, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలో కొరువాడ, లంకవానిపాలెం, శృంగవరం, పిండ్రంగి, కొరువాడ జగన్నాథపురం, కె.అగ్రహారం, సూర్రెడ్డిపాలెం, సింగన్నదొరపాలెం, దాలివలస గ్రామాల్లో రూ.10 కోట్ల 27 లక్షలతో నిర్మాణం పూర్తి చేసుకున్న 20 అభివృద్ధి పనులను గురువారం ఆయన ప్రారంభించారు. కొరువాడ గ్రామంలో రూ.25 లక్షలతో నిర్మాణం చేపట్టిన అదనపు మంచినీటి పథకం, ఇంటింటి కుళాయిలకు శ్రీకారం చుట్టారు. అనంతరం లంకవానిపాలెం, శృంగవరం, పిండ్రంగి, కె.అగ్రహారం, దాలివలస గ్రామాల్లో సీసీ రోడ్లును ప్రారంభించారు. కొరువాడ, సింగన్నదొరపాలెం, దాలివలస గ్రామాల్లో సచివాలయం, హెల్త్ వెల్‌నెస్ సెంటర్, ఆర్బీకే భవనాలను ఆయన ప్రారంభించి శిలాఫలకాలను ఆవిష్కరించారు. పిండ్రంగి–కొత్తభూమి, కె.జె.పురం–రైవాడ కెనాల్ మార్గం, సింగన్నదొరపాలెం–దాలివలస, కొరువాడ–గవరపాలెం గ్రామాల మధ్య నిర్మాణం జరిపిన తారురోడ్లను ప్రారంభించారు. డిప్యూటీ సీఎంను మహిళలు కోలాటం ఆడుతూ, పువ్వులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముత్యాలనాయుడు మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో మాడుగుల నియోజకవర్గంలో ప్రతి గ్రామంలోను కోట్లాది రుపాయల నిధులతో అభివృద్ధి పనులు జరిపినట్లు తెలిపారు. కేవలం నాలుగేళ్ల 9 నెలల్లోనే 10 ఏళ్ల అభివృద్ధికి చేసి చూపించినట్లు తెలిపారు.బూడి ముత్యాలనాయుడును సర్పంచ్, ఎంపీటీసీలు చీపురపల్లి అచ్చిబాబు, వేచలపు దొరబాబు, జాగరపు వెంకటరామలక్ష్మి, లెక్కల పైడంనాయుడు, తోట భవాని, నెక్కల పెంటయ్య, చీపురపల్లి గోవింద, యడ్ల దేముళ్ళు, రొంగలి వెంకటరమణ, లాలం నాని, భూమిరెడ్డి అప్పారావు, దేముళ్ళు, ఆదిరెడ్డి రామునాయుడు, రొంగలి రాము దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ అల్లు సూర్యనారాయణ, మండల ఇంజనీర్లు బాలాజీ అప్పారావు, అల్లు శ్వేత, వెలుగు ఏపీఎం వెంకటలక్ష్మి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, డీసీసీబీ డైరెక్టర్ చల్లా సత్యనారాయణమూర్తి, వైస్ ఎంపీపీలు రొంగలి సూర్యనారాయణ, లెక్కల గోపి, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ–కిరండూల్ రైలుకు మరో విస్టాడోమ్ కోచ్

తాటిచెట్లపాలెం : అరకు వెళ్లే ప్రయాణికుల, పర్యాటకుల సౌకర్యార్థం విశాఖ–కిరండూల్ – విశాఖ రైలుకు మరో విస్టాడోమ్ కోచ్‌ను అదనంగా జత చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. విశాఖ–కిరండూల్(08551) పాసింజర్ స్పెషల్ రైలుకు ఈ నెల 5,6,7,12,14,19,20,21,26,27,28వ తేదీల్లోను, తిరుగు ప్రయాణంలో కిరండూల్‌లో బయల్దేరే కిరండూల్ –విశాఖ (08552) పాసింజర్ స్పెషల్ రైలుకు ఈ నెల 6,7,8,13,14, 15,20,21,22, 27,28,29వ తేదీల్లోనూ విస్టాడోమ్ కోచ్‌ను అదనంగా జతచేస్తున్నారు.

ఇంటింటికీ మంచినీరు

- చోడవరం ప్రజల దీర్ఘకాలిక సమస్య పరిష్కారం
- రూ.13.4 కోట్లతో నిర్మించిన మినీ మంచినీటి రిజర్వాయరు ప్రారంభించిన ధర్మశ్రీ



పంప్ హౌస్‌ను స్విచ్ ఆన్ చేసి ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: సుదీర్ఘకాలంగా చోడవరం ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్య పరిష్కారమయ్యింది. రూ.13 కోట్ల 40 లక్షలతో నిర్మించిన మంచినీటి బ్యారేజ్‌ను ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ గురువారం ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక చోడవరం ప్రజల మంచినీటి సమస్య పరిష్కరిస్తామని గత ఎన్నికల ముందు ధర్మశ్రీ హామీ ఇచ్చారు. అన్న మాట ప్రకారం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో సుమారు 25 వేల మంది జనాభా ఉన్న ఈ మేజర్ పంచాయతీలోని మంచినీటి సమస్య పరిష్కారానికి రూ.13 కోట్ల 40 లక్షలు మంజూరు చేశారు. ఈ సొమ్ముతో పెద్దేరు నదిలో పంప్ హౌస్ నిర్మాణంతోపాటు జన్నవరం కొండపై మినీ మంచినీటి బ్యారేజ్ నిర్మించి పెద్దపెద్ద పైపులైన్ల ద్వారా చోడవరం పంచాయతీ పరిధిలో చోడవరం పట్టణం, పీఎస్‌పేట, బంగారమ్మపాలెం, అన్నవరం, రేవళ్ల, వెంకయ్యగారిపేటతోపాటు జన్నవరం, బెన్నవోలు గ్రామాల్లో ఉన్న మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంక్‌లకు అనుసంధానం చేశారు. ఆయా గ్రామాల్లో మంచినీరు నేరుగా ప్రతి ఇంటికి వెళ్లేలా కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. ఈ భారీ మంచినీటి పథకాన్ని ఎమ్మెల్యే ధర్మశ్రీ ప్రారంభించి ప్రతి ఇంటికి మంచినీరు అందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శివకృష్ణ, ఏఈ కనకమ్మ, ఎంపీపీ గాడి కాసు, గ్రామాల సర్పంచ్‌లు బండి నూకాలమ్మ, కోసిన సన్యాసిరావు, మూడెడ్ల శంకరరావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



సూచనలు చేస్తున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి మోహన్‌రావు

నర్సీపట్నం: నర్సీపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా వ్యవసాయశాఖాధికారి మోహన్‌రావు పరిశీలించారు. 15 మంది రైతుల వద్ద 40 క్వింటాళ్ల ధాన్యం సేకరించామని నిర్వాహకులు జిల్లా అధికారికి చెప్పారు. సర్వర్ సక్రమంగా పని చేయకపోవటం వల్ల రైతుల వద్ద నుంచి బయోమెట్రిక్ తీసుకునేందుకు ఆలస్యమవుతుందని వారు వివరించారు. సాంకేతిక ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని మోహన్‌రావు పేర్కొన్నారు. ధాన్యం తీసుకువచ్చిన రైతులతో మాట్లాడారు. ఆయన వెంట ఏడీఏ శ్రీదేవి ఉన్నారు.

రేపటి నుంచి ట్యాక్స్ పేయర్స్ హబ్



వివరాలు వెల్లడిస్తున్న ఆదాయ పన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్ రాజీవ్ కుమార్ సింగ్

సాక్షి, విశాఖపట్నం : ఈ నెల 6 నుంచి మూడు రోజుల పాటు ట్యాక్స్ పేయర్స్ హబ్‌ను విశాఖపట్నం బీచ్‌రోడ్డులో నిర్వహిస్తున్నట్లు ఆదాయ పన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్ రాజీవ్ కుమార్ సింగ్ వెల్లడించారు. డాబాగార్డెన్స్‌లోని అయకార్ భవన్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోని ఏడు నగరాల్లో టాక్స్ పేయర్స్ హబ్‌ను నిర్వహిస్తున్నారని, దక్షిణాది రాష్ట్రాల్లో విశాఖను ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రతి పన్ను చెల్లింపుదారుడు దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక భాగస్వామి అనే థీమ్‌తో నిర్వహిస్తున్న టాక్స్ పేయర్స్ హబ్ కార్యక్రమాన్ని ఇన్‌కమ్ ట్యాక్స్ డిప్యూటీ జనరల్ అర్చన చౌదరి ప్రారంభించనున్నారని వివరించారు.పన్ను చెల్లింపుదారులకు ఇన్ఫర్మేషన్ కియోస్క్, ఫిర్యాదు నమోదు కియోస్క్ సేవలను కూడా అందిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ వానా శ్రీనివాస్ రావు, డిప్యూటీ కమిషనర్ మధుసూదన రావు, ఆదాయ పను పన్ను అధికారులు ఎంవీఎస్ఎస్ భావనారాయణ, కే.లలిత్, ఎం నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట ప్రకారం రూ.3 వేల పింఛన్



దేవరాపల్లిలో పింఛన్ల నమూనా చెక్కును అందజేస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



బుచ్చెయ్యపేటలో ఇంటికెళ్లి కొత్త పింఛన్ సొమ్ము అందిస్తున్న విప్ ధర్మశ్రీ

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు
- సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం
- బుచ్చెయ్యపేటలో పింఛన్ కానుక పెంపు కార్యక్రమంలో విప్ ధర్మశ్రీ

దేవరాపల్లి/కె.కోటపాడు: ఇచ్చిన మాట ప్రకారం అవ్వాతాతల పింఛన్ సొమ్మును రూ. 3 వేలకు పెంచడంతోపాటు దేశంలోనే అత్యధిక పింఛన్లు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు అన్నారు. గురువారం దేవరాపల్లిలోని రైవాడ అతిథి గృహం ఆవరణలోనూ కె.కోటపాడు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోనూ వేర్వేరుగా కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. దేవరాపల్లి మండలంలో ప్రతినెలా రూ. 2.95 కోట్లు, కె.కోటపాడు మండలంలో 11,024 మంది లబ్ధిదారులకు రూ.2.86 కోట్లు పింఛన్ల రూపంలో అందిస్తున్నారు. వీటి నమూనా చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. వారితో కలిసి సీఎం జగన్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేసి అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో పింఛన్ పొందాలంటే, జన్మభూమి కమిటీ సభ్యులకు మామూళ్లు ఇవ్వాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. పైగా నాలుగైదు రోజుల పాటు కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వలంటీర్లు ప్రతి నెలా ఒకటో తేదీన వేకువజామున ఇంటి తలుపుకొట్టి మరీ అందిస్తున్నట్లు తెలిపారు. చంద్రబాబు 2014లో రైతు, డ్వాక్రా రుణమాఫీ, నిరుద్యోగ భృతి హామీల అమలులో మోసం చేశాడన్నారు. సీఎం జగన్ మాత్రం 2019 ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చిన ప్రతీ హామీని నెరవేర్చినట్లు తెలిపారు. దేవరాపల్లి మండలంలో 226 మందికి, కె.కోటపాడు మండలం 202 మందికి పింఛన్లు మంజూరయ్యాయన్నారు. టీడీపీ హయాంలో బడ్జెట్‌లో సొమ్ము పాలకుల జేబుల్లోకి వెళ్లగా, నేడు జగన్ పాలనలో సంక్షేమ పథకాల రూపంలో పేదల ఖాతాల్లోకి జమ చేస్తున్నారన్నారు.

ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీలు కిలపర్తి రాజేశ్వరి, రెడ్డి జగన్‌మోహన్, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, రాష్ట్ర మహిళా సంయుక్త కార్యదర్శి రొంగలి నారాయణమ్మ, మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వి.సింహాచలంనాయుడు, ప్రత్యేకాధికారులు నాగలక్ష్మి, వి.రవీంద్రనాథ్, తహసీల్దార్ జె.రమేష్‌బాబు, ఎంపీడీవోలు ప్రసాద్, సిహెచ్. సుబ్బలక్ష్మి, వైస్ ఎంపీపీలు చింతల బుల్లి లక్ష్మి, రొంగలి సూర్యనారాయణ, లెక్కల గోపి, డీసీసీబీ డైరెక్టర్ చల్లా సత్యనారాయణమూర్తి, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గొర్రుపోటు రమాదేవి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, పార్టీ యువజన విభాగం మండలాధ్యక్షుడు గొర్రుపోటు వెంకటరావు, జేసీఎస్ మండల కన్వీనర్లు కేవీ రమణ, ఏటుకూరి రాజేష్, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ జి. సంతోషి నళిని, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, వేచలపు దొరబాబు, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, కర్రి సూరినాయుడు, ఉగ్గ్రాకుల అప్పారావు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలో ఎవరైనా చనిపోతేనే పింఛన్

బుచ్చెయ్యపేట: గత తెలుగుదేశం పార్టీ హయాంలో ఎవరైనా చనిపోతేనే కొత్త పింఛన్ ఇచ్చేవారని, నేడు వైఎస్సార్‌సీపీ పాలనలో అర్హతే ప్రామాణికంగా పింఛన్ అందిస్తున్నారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. పింఛన్ కానుక పెంపుతోపాటు కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం బుచ్చెయ్యపేటలో ఆయన ప్రారంభించారు. గత ఎన్నికల ముందు వరకు టీడీపీ ప్రభుత్వం రూ.వెయ్యి పింఛన్ మాత్రమే కొద్ది మందికి ఇచ్చేవారన్నారు. అది నెలలో ఎప్పుడు, ఎక్కడ ఇచ్చేవారో తెలిసేది కాదని ఎద్దేవా చేశారు.

దాని కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండా వానలో పండుటాకులు పడిగాపులు కాసేవారన్నారు. గత టీడీపీ అవినీతి పాలనను, ప్రస్తుతం జగనన్న చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను పరిశీలించి వచ్చే ఎన్నికల్లో మరలా రెండో సారి ముఖ్యమంత్రిగా జగనన్నను, ఎమ్మెల్యేగా తనని గెలిపిస్తే నెలకు ఐదు వేల పింఛన్ అందేలా చూస్తామన్నారు. తాను గెలిచిన నాల్గున్నరేళ్లలోనే రూ.1,882 కోట్లతో అభివృద్ధి చేశానన్నారు.

నియోజకవర్గానికి కొత్తగా 532, బుచ్చెయ్యపేట మండలానికి కొత్తగా 126 పింఛన్లు మంజూరయ్యాయన్నారు. బుచ్చెయ్యపేట మండలం మొత్తం మీద 10,943 మందికి ప్రతి నెలా 3,25,08,500 రూపాయలు పింఛన్ల రూపంలో అందిస్తున్నామన్నారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి పలువురికి పింఛన్ సొమ్ము అందించారు. దివ్యాంగుడు ధనంరెడ్డి సత్తిబాబు, ధనంరెడ్డి చిన తల్లి, ఆది పైడమ్మ, మాటూరి రమణ తదితర్లు కొత్త పింఛన్లు అందుకున్నారు.

కార్యక్రమంలో ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, పార్టీ మండలాధ్యక్షుడు జోగా కొండబాబు, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు, బుచ్చెయ్యపేట కోఆపరేటివ్ అధ్యక్షుడు సుంకరి శ్రీను, డీపీవో శిరీషారాణి, ఎంపీడీవో సువర్ణరాజు, తహసీల్దార్ అరుణ్‌చంద్ర పాల్గొన్నారు.

వైభవుడి ఆలయ నిర్వహణ భేష్

మురళీనగర్: వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయం నిర్వహణ బాగుందని రాజమండ్రి మల్టీజోన్-1 రీజినల్ జాయింట్ కమిషనర్ ఎంవీ సురేష్ బాబు తెలిపారు. సతీసమేతంగా విచ్చేసిన ఆయనకు గురువారం ఇక్కడ ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఆధ్వర్యంలో అర్చకులు సంప్రదాయ సిద్ధంగా స్వాగతం పలికారు.



సురేష్ బాబుకు వైభవుడి చిత్రపటాన్ని అందిస్తున్న ఈవో ప్రసాద్

మంత్రి అమర్‌నాథ్‌తో వై.వి.సుబ్బారెడ్డి భేటీ



వై.వి.సుబ్బారెడ్డిని సత్కరిస్తున్న మంత్రి అమర్‌నాథ్

అక్కిరెడ్డిపాలెం (విశాఖ): వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి గురువారం రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో మిందిలో ఆయన నివాసంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వై.వి.సుబ్బారెడ్డికి మంత్రి అమర్‌నాథ్ శాలువా కప్పి, నృసింహస్వామి చిత్రపటాన్ని అందజేశారు. అనకాపల్లి ఎంపీ సత్యవతి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, గాజువాక సమన్వయ కర్త, కార్పొరేటర్ ఉరుకూటి రామచంద్రరావు, కార్పొరేటర్లు గుడివాడ అనూష, రాజాన రామారావు, బొడ్డు నర్సింహపాత్రుడు, ఇమ్రాన్, అనకాపల్లి సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, నాయకులు దంతలూరి దిలీప్ కుమార్, మలసాల రమణారావు, ధనమ్మ, సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ బోగాది సన్యాసిరావు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి.పూర్ణానంద శర్మ, 68వ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్, సీఈసీ మెంబర్ గుడివాడ అప్పలరామ్మూర్తి, వాసు, పలువురు డైరెక్టర్లు పాల్గొన్నారు.

తెలుగు మహాసభలకు చంటిబాబు మాస్టారు





అంతర్జాతీయ తెలుగు మహాసభల్లో ప్రదర్శించనున్న చంటిబాబు కార్టూన్లు

- రాజమహేంద్రవరంలో ప్రదర్శనకు ఆయన గీసిన కార్టూన్లు



అంబటి చంటి బాబు మాస్టారు

నాతవరం: అంతర్జాతీయ తెలుగు మహాసభలకు అంబటి చంటిబాబు మాస్టారుకు ఆహ్వానం అందింది. ఈ మేరకు రాజమహేంద్రవరానికి గురువారం ఆయన బయలుదేరి వెళ్లారు. అక్కడ తను గీసిన కార్టూన్లు ప్రదర్శించనున్నారు. మండలంలో చమ్మచింత గ్రామానికి చెందిన చంటిబాబు మాస్టారు ఇదే మండలం జిల్లేడుపూడి పంచాయతీ శివారు వెంకయ్యపాలెం పాఠశాలలో హెచ్‌ఎంగా పని చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ సారసత్వ పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ నుంచి రాజమహేంద్రవరం గైట్ కళాశాలలో నిర్వహించే మహాసభల్లో ఆయన పాల్గొననున్నారు. ఈ సభలకు దేశ, విదేశాల్లో పేరుగాంచిన తెలుగు ప్రముఖులు, కవులు, కళాకారులు, గవర్నర్లు, మంత్రులు హాజరు కానున్నారు. ఈ సందర్భంగా చంటిబాబు మాస్టారుకు ఎంఈవోలు తాడి అమృత్‌కుమార్, కామిరెడ్డి వరహాలబాబు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

బైక్‌పై వెళ్తున్న మహిళపై దాడి

యలమంచిలి రూరల్: వ్యాపార భాగస్వామితో ఆర్థిక లావాదేవీల వివాద నేపథ్యంలో అతని తల్లిపై వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన యలమంచిలి మండలం పురుషోత్తపురం హైవే కూడలికి సమీపంలో గురువారం చోటు చేసుకుంది. మున్సిపాలిటీ పరిధి కొత్తపాలెం గ్రామానికి చెందిన రాపేటి గణేష్, సోమలింగపాలెం గ్రామానికి చెందిన అతికినశెట్టి జగన్నాథరావు గతంలో వ్యాపారం చేసేవారు. ఆ సమయంలో వీరిద్దరి మధ్య ఏర్పడిన ఆర్థిక వివాదాన్ని పెద్ద మనుషుల మధ్య రాజీ చేసుకున్నారు. ఇంకా తనకు డబ్బు ఇవ్వాల్సి ఉందంటూ ఇటీవల జగన్నాథరావు, గణేష్ కుటుంబంపై కక్ష పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం ద్విచక్ర వాహనంపై వెళ్తున్న గణేష్, అతని తల్లి లక్ష్మితో వాగ్వాదానికి దిగాడు. ఆమె ముఖంపై చేతితో దాడి చేశాడు. దీంతో ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడిపోయిన ఆమె తీవ్రంగా గాయపడింది. యలమంచిలి సామాజిక ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు యలమంచిలి పట్టణ ఎస్సై పాపినాయుడు తెలిపారు.

క్లుప్తంగా

కొత్త పింఛన్ల పంపిణీ నేడు

అనకాపల్లి: కొత్తగా మంజూరైన పింఛన్లను స్థానిక జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపీ బీవీ సత్యవతి, అసెంబ్లీ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్‌లు హాజరవుతారన్నారు. స్థానిక కార్పొరేటర్లు, అధికారులు, పార్టీ శ్రేణులు, లబ్ధిదారులు హాజరుకావాల్సిందిగా కోరారు.

భూ యాజమాన్య చట్టానికి వ్యతిరేకంగా నిరసన



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ నేతలు

అనకాపల్లి: కేంద్రం తీసుకొచ్చిన భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక నెహ్రూచౌక్‌లో సీపీఐ నేతలు గురువారం భూ హక్కు చట్టానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పేదల భూములకు రెవెన్యూ వ్యవస్థ వల్ల రక్షణ లేకుండా పోయిందన్నారు. అంతకుముందు చట్ట ప్రతులను దగ్ధం చేశారు. కార్యక్రమంలో సీపీఐ జోనల్ కార్యదర్శి వైఎస్ భద్రం, నేతలు తాకాశి వెంకటేశ్వరరావు, కోరిబిల్లి శంకరరావు, చెల్లూరి నాగరాజు, మత్తుర్తి సూరిబాబు, ఎం.చిన్ని, ఆర్.వెంకటరావు, పెంటారావు పాల్గొన్నారు.

కొనసాగిన పారిశుధ్య కార్మికుల నిరసన



శిబిరంలో నినాదాలు చేస్తున్న భానుమూర్తియాదవ్, కార్మికులు

అనకాపల్లి: తమ సమస్యలు పరిష్కరించాలంటూ పారిశుధ్య కార్మికులు గురువారం కూడా సమ్మె కొనసాగించారు. కార్మికుల నిరసన శిబిరాన్ని కాంగ్రెస్ నేత భానుమూర్తియాదవ్ సందర్శించి మాట్లాడారు. కార్మికుల సమస్యల్ని తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు మల్లపురెడ్డి కోటేశ్వరరావు, కత్తెర శ్రీధర్, సేనాపతి ఈశ్వరరావు(రాజు), కేవీ మాణిక్యం, బి.బాలమురళి, కార్మికులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 6,860 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,250	4,890
మొదటి రకం	3,910	4,640
రెండో రకం	3,720	4,380
మూడోరకం	3,400	3,710

అనకాపల్లి సినిమాలు

బబుల్ గమ్	:	రాజా
కపాలదేవి	:	సత్యనారాయణస్క్రీన్-1
దీనమ్మ జీవితం	:	సత్యనారాయణస్క్రీన్-2
డెవిల్	:	షిర్డిసాయి
సలార్	:	పర్తిసాయి
రాఘవరెడ్డి	:	వెంకటేశ్వర
తికమక తాండ	:	శ్రీసత్య
సలార్	:	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 51 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-6 యూనిట్లు, బీ పాజిటివ్-16 యూనిట్లు, ఓ పాజిటివ్-24 యూనిట్లు, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 394 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 373 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

ఇది కదా అభివృద్ధి

అభివృద్ధి C/o తాళ్లపాలెం



నాను కొసిరెడ్డి కళావతిని. తాళ్లపాలెంలోని ఎన్టీఆర్ కోలనీ మాది. నలబయ్యేళ్లుగా ఇక్కడే ఉంతన్నాం. మా ఆయన సిమెంట్ పేక్టరీలో పనిసేత్తాడు. ముగ్గురు ఆడపిల్లలు మాకు. నా సిన్నప్పట్నుంచి మా కోలనీలో మురిక్కాలువల్లేవు. గొయ్యిలు తవ్వి, అందులోకి మురికి నీరెళ్లేలాగ చేసుకున్నాం. ఈటితోనే దోమలు ఎక్కువవుతున్నాయని ఆపీసర్లు శానామార్లు సెప్పారు. మాకు మరే దార్లేదు. జగనన్న సీఎం అయ్యాక మా కాలనీ తీరే మారిపోనాది. దగ్గరదగ్గర 12 లచ్చల్తో సిమెంటు కాలువలు కట్టారు. ఇపుడు మా గుమ్మాలెదురుగా మురికి నీరు కనబడదు.. అంటూ కళావతి తన ఆనందాన్ని వ్యక్తం చేసింది.



తాళ్లపాలెంలో నిర్మించిన 2వ సచివాలయ భవనం

- రూ.4 కోట్లతో పలు అభివృద్ధి పనులు
- 40 ఏళ్లలో చూడనిది.. నాలుగున్నరేళ్లలో చూశాం
- ప్రభుత్వంపై తాళ్లపాలెం ప్రజల ప్రశంసలు



కొత్తగా నిర్మించిన సిమెంట్ రోడ్డు



తాళ్లపాలెం ఎన్టీఆర్ కాలనీలో నిర్మించిన సిమెంట్ రోడ్డు, డ్రైనేజీలు

కశింకోట: కశింకోట తర్వాత రెండో పెద్ద పంచాయతీ తాళ్లపాలెం. సుమారు 5 వేల మంది జనాభా. చుట్టు పక్కల గ్రామాలకు ఇదే ప్రధాన కూడలి. ఇక్కడ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. జనాభా ప్రాతిపదికన ప్రజలకు విరివిగా ప్రభుత్వ సేవలు అందించేందుకు రెండు సచివాలయాలను ఏర్పాటు చేశారు. సచివాలయ భవనాల కోసం పంచాయతీ కార్యాలయం పైన రూ.25 లక్షలు, గురుకుల పాఠశాల వద్ద రూ.41 లక్షలతో ప్రత్యేక భవనాలను నిర్మించి ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు.

అన్ని విధాలా అభివృద్ధి

- ఎన్టీఆర్ కాలనీలో సుమారు 40 ఏళ్లుగా వేధిస్తున్న డ్రైనేజీ సమస్యను తొలగించారు. తొలిసారిగా ఈ కాలనీకి గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.12 లక్షలతో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేశారు.
- హైస్కూల్ ప్రాంతం, 1వ వార్డు, దుర్గా వీధి, గురుకుల పాఠశాల తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే నిధులు, ఇతర నిధులు రూ.35 లక్షలతో సిమెంట్ రోడ్లు, మురికి కాలువలు నిర్మించారు.
- గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో బంగారయ్యపేటలో మురికి కాలువలు, సిమెంట్ రోడ్ల నిర్మాణాన్ని ఇటీవలే ప్రారంభించారు.
- తాళ్లపాలెంలో ఏపీ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను నాడు-నేడు నిధులు రూ.75 లక్షలతో అభివృద్ధి చేశారు.
- జిల్లా పరిషత్ హైస్కూల్లో రూ.43 లక్షలతో మరమ్మతులు, విద్యుత్ సదుపాయం, గచ్చుల నిర్మాణం, ఫర్నిచర్ తదితర వసతులను ఏర్పాటు చేశారు.
- 2వ ప్రాథమిక పాఠశాలను రూ.18 లక్షలతో అభివృద్ధి చేశారు.
- దాదాపు దశాబ్ద కాలంగా అసంపూర్తిగా ఉన్న కల్యాణ మండపాన్ని అరబిందో పరిశ్రమ సహకారంతో రూ.40 లక్షలు వెచ్చించి అందంగా పునరుద్ధరించారు.
- జల్ జీవన్ మిషన్ పథకంలో రూ.25 లక్షలు వెచ్చించి ఇంటింటి కుళాయి కనెక్షన్లు, పైపులైన్ ఏర్పాటు చేశారు. తాళ్లపాలెం సంత, గొల్లపేట ప్రాంతాల్లో ఇంటింటి కుళాయిలు ఇచ్చారు. తాళ్లపాలెం గ్రామంలో సుమారు 800 ఇళ్లకు కుళాయిలు ఏర్పాటు చేశారు. ప్రధాన పైపులైన్‌కు అనుసంధానించాల్సి ఉంది.
- బంగారయ్యపేట నుంచి గొల్లపేటకు వెళ్లే రోడ్డులో రూ.5 లక్షలతో వంతెనను పునరుద్ధరించారు. దీంతో రాకపోకలు సుగమం కావడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.50 లక్షలతో టెస్టింగ్ ల్యాబ్ భవనాన్ని నిర్మిస్తున్నారు. దాదాపు ముగింపు దశకు చేరుకుంటుంది.



నాడు-నేడులో గురుకుల పాఠశాల అభివృద్ధి

అభివృద్ధి కార్యక్రమాల్లో కొన్ని

2 సచివాలయ భవనాలు	రూ.66 లక్షలు
రోడ్లు, సిమెంట్ కాలువల నిర్మాణం	రూ.67 లక్షలు
కల్యాణ మండపం పునరుద్ధరణ	రూ.40 లక్షలు
నాడు-నేడులో గురుకుల పాఠశాల అభివృద్ధి	రూ.75 లక్షలు
జిల్లా పరిషత్ హైస్కూల్ అభివృద్ధి	రూ.43 లక్షలు
ప్రాథమిక పాఠశాల-2 అభివృద్ధి	రూ.18 లక్షలు
పీహెచ్‌సీలో ల్యాబ్ నిర్మాణం	రూ.50 లక్షలు
ఇంటింటి కుళాయి కనెక్షన్లు	రూ.25 లక్షలు
అంగన్‌వాడీ భవన నిర్మాణం	రూ.13 లక్షలు

జగన్‌ను మళ్లీ సీఎం చేయడమే ధ్యేయం

- కార్యకర్తలతో పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



భరత్‌ను అభినందిస్తున్న రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి అమర్‌నాథ్

కశింకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేయడమే ధ్యేయంగా కార్యకర్తలు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి సూచించారు. గురువారం కశింకోట వచ్చిన ఆయన కేక్ కట్ చేసి కార్యకర్తలకు నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లో ప్రచారం చేసి పార్టీ విజయానికి దోహదపడాలన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్‌ను సుబ్బారెడ్డి పరిచయం చేశారు. ఆయన విజయానికి ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ పార్టీ అధిష్టానం ఆదేశాలు తనకు శిరోధార్యమన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగన్ తనకు సీటు ఇచ్చినా, ఇవ్వకపోయినా పార్టీలోనే ఉంటూ వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేస్తానన్నారు. ఎంపీ బీవీ సత్యవతి, జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, సర్పంచ్ మంత్రి జయరజని తదితరులు పాల్గొన్నారు. సచివాలయ సిబ్బంది సుబ్బారెడ్డిని కలిసి, శుభాకాంక్షలు తెలిపారు.

తలంబ్రాల బియ్యం పంపిణీ

మునగపాక : మండలంలోని పలు గ్రామాలకు అయోధ్య నుంచి తీసుకువచ్చిన తలంబ్రాల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. మండల వ్యాప్తంగా పంపిణీ చేసేందుకు మునగపాక సంతబయిల రామాలయానికి తలంబ్రాల బియ్యం వచ్చిన విషయం తెలిసిందే. అక్కడ నుంచి మండలంలోని పలు రామాలయాలకు వేదపండితుల సారథ్యంలో పంపిణీ కార్యక్రమాన్ని గురువారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పురోహితులు సాయికుమార్,కాండ్రేగుల మణికంఠ పాల్గొన్నారు.

వైభవంగా గంగపరదేశమ్మ అనుపు ఉత్సవం

అనకాపల్లి:పట్టణంలోని గవరపాలెం శ్రీ గంగపరదేశమ్మ భవానీ భక్తులు, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కనకదుర్గమ్మ అనుపు మహోత్సవం నేత్రపర్వంగా సాగింది. అమ్మవారి చండీయాగ మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. అమ్మవారికి ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 52 రోజులపాటు జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను ఆధ్యాత్మికత వైపు నడిపించాయి. అమ్మవారి ఊరేగింపు గవరపాలెం పురవీధులగుండా సాగింది. మంగళవాయిద్యాలతోపాటు దేవతా మూర్తుల నృత్య ప్రదర్శన, గిరిజన నృత్యాలు, కేళ వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు కాండ్రేగుల శ్రీరాం, సభ్యులు మద్దాల శ్రీను, కె.సుబ్బు, కె.వెంకట్, బి.వర, వి.మహేష్, ఎం.గోపి, బి.ఆది, ఎం.సుబ్బు, పి.యుగంధర్, కె.సాంబ, బి.గంగాధర్, డి.కుమార్, కె.శంకరరావు, ఎం.నగేష్ పాల్గొన్నారు.





వెంకన్న, యమధర్మరాజు వేషధారులు



కేరళ వాయిద్యాలు సందడి



కాళీమాత నృత్య ప్రదర్శనలో కళాకారులు

కనకమహాలక్ష్మి ఆలయానికి పోటెత్తిన భక్తజనం



మలసాల రమణారావు, ధనమ్మ దంపతులను జ్ఞాపికతో సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు



ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి

కశింకోట: కశింకోటలో ప్రసిద్ధి చెందిన కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా నాల్గవ గురువారం కావడంతో జిల్లా నలుమూల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. అరటిగెలలు, చీరలు, రవికలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. ఉదయం అమ్మవారికి క్షీరాభిషేకం నిర్వహించి ఆభరణాలు, నూతన వస్త్రాలు, పూలమాలలతో అలంకరించారు. ఆలయ అర్చకులు వి.చిదంబరం, వి.కృష్ణల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసా రమణారావు, మాజీ ఎంపీపీ కాసులమ్మ(ధనమ్మ) దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. వారికి ఆలయ కమిటీ తరఫున జ్ఞాపికను అందించి, గౌరవ సత్కారం చేశారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలకరించారు. లక్ష్మీదేవి విద్యుత్ సెట్టింగ్‌లతోపాటు పలు దేవతామూర్తుల సెట్టింగ్‌లు భక్తులను ఆకర్షించాయి. మధ్యాహ్నం అన్న సమారాధన చేశారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు భీశెట్టి కుమార్, ప్రతినిధులు సూరిశెట్టి రేవతి, వేగి వెంకటరావు పాల్గొన్నారు.

పలు చోరీలకు పాల్పడిన నిందితుని అరెస్టు



మాట్లాడుతున్న ఏఎస్పీ టి.ఎస్.రావు



నిందితుడు పిల్లా నూకరాజు(ఫైల్)

పరవాడ: అనకాపల్లి జిల్లాలోని పలు ప్రాంతాల్లో 10 చోరీ కేసులతో సంబంధం ఉన్న నిందితుడిని పరవాడ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు అడిషనల్ ఏఎస్పీ పి.సత్యనారాయణరావు (క్రైం) చెప్పారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పరవాడ మండలం మంత్రిపాలెం గ్రామంలో గత నెల 7న జరిగిన చోరీలో అరతులం బంగారం, రెండు జతల వెండి పట్టీలు, రూ.8,500 నగదు అపహరణకు గురయ్యాయి.

ఈ కేసుకు సంబంధించి అందిన ఫిర్యాదు మేరకు పరవాడ సీఐ పి.ఈశ్వరరావు నేతృత్వంలో క్రైం పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. చోడవరం మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన పిల్లా నూకరాజును లంకెలపాలెం కూడలిలో గురువారం అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. నిందితుడు నూకరాజు అనకాపల్లి జిల్లా రావికమతంలో 3, దేవరాపల్లిలో 2, చీడికాడలో 1, సబ్బవరం, కోటపాడు, బుచ్చెయ్యపేట, మంత్రిపాలెం ప్రాంతాల్లో 10 చోరీలకు పాల్పడినట్లు అంగీకరించాడని తెలిపారు. ఈ చోరీ కేసుల్లో నిందితుడు 28 తులాల బంగారం, 39 తులాల వెండి, రూ.1.48 లక్షల నగదును అపహరించినట్లు కనుగొన్నామని చెప్పారు. నిందుతుడి నుంచి 22 తులాల బంగారు ఆభరణాలు, రూ. 2,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చోరీని అతి తక్కువ సమయంలో ఛేదించిన పరవాడ సీఐ పి.ఈశ్వరరావు, క్రైం ఏఎస్ఐ బి.ఎర్రునాయుడు, పోలీసులు ఎస్.నాగేంద్ర, జి.వి.వి.ఎస్.నాయుడు, ఎం.దివాకర్‌బాబు, జి.మోహన్‌ప్రసాద్, సీసీఎస్ ఎస్ఐ రమేష్, ఏఎస్ఐ ప్రదీప్‌కుమార్‌లను ఏఎస్పీ పి.సత్యనారాయణరావు ప్రశంసించారు. సమావేశంలో పరవాడ సబ్ డివిజన్ ఇన్‌చార్జి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐ పి.ఈశ్వరరావు, క్రైం పోలీసులు పాల్గొన్నారు.

రైతుల కమతాల చెంతకే శాలిహోత్ర ఎక్స్‌ప్రెస్ సేవలు



అరబుపాలెంలో శాలిహోత్ర ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభిస్తున్న సంజయ్‌ప్రకాష్

మునగపాక : రైతుల కమతాల చెంతకే పశువైద్య సేవలందించేందుకు శాలిహోత్రా ఎక్స్‌ప్రెస్ దోహదపడుతుందని ఎస్‌బీఐ ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ ప్రకాష్ అన్నారు. మండలంలోని అరబుపాలెం గ్రామంలో ఎస్‌బీఐ ఫౌండేషన్ అలాగే బైఫ్ భాగస్వామ్యంతో గురువారం రైతులకు ప్రయోజకారిగా ఉండే శాలిహోత్ర ఎక్స్‌ప్రెస్ వాహనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుపోషణ గ్రామీణ జీవనోపాధిలో అంతర్భాగమేనన్నారు. రైతులను ఆదుకోవడమే లక్ష్యంగా శాలిహోత్ర ఎక్స్‌ప్రెస్ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనకాపల్లి జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి బి.ప్రసాదరావు మాట్లాడుతూ రైతుల ప్రయోజనార్థం ఎస్‌బీఐ ఫౌండేషన్ అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శాలిహోత్ర వాహనం ప్రతి గ్రామానికి వెళ్లి సంప్రదాయ పద్ధతిలో కృత్రిమ గర్భధారణతో సహా సరికొత్తగా పశువైద్య సేవలందిస్తుందన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సవాల్‌ను దృష్టిలో ఉంచుకొని బైఫ్ సౌజన్యంతో వాహన సదుపాయం కల్పించినట్టు బైఫ్ ప్రతినిధి గోపాలరెడ్డి తెలిపారు. ఎస్‌బీఐ అనకాపల్లి రీజనల్ ఆఫీస్ చీఫ్ మేనేజర్ రవికుమార్, మునగపాక ఎస్‌బీఐ మేనేజర్ శ్రీవల్లి, సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వెదురువాడ వార్డు సభ్యులతో ఎమ్మెల్యే కన్నబాబు తదితరులు

అచ్యుతాపురం : మండలంలోని వెదురువాడ వార్డు మెంబర్ కిలాడి శివ, పంచదార్ల కరుణ చిన్న, ఊరుకూటి తాతారావు వారి కుటుంబ సభ్యులు గురువారం యలమంచిలి ఎమ్మెల్యే రమణమూర్తిరాజు (కన్నబాబు) సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. మాజీ ఎంపీపీ చేకూరి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు బుద్ధరాజు రాజేశ్ నాయకత్వంలో వీరు వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో వడిశెట్టి శ్రీను, లాలం శ్రీను, బలిరెడ్డి శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా బ్రెయిలీ జయంతి



బ్రెయిలీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

పరవాడ : స్థానిక భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీ నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ బ్లైండ్ యూనిట్ అధ్యక్షుడు ఎస్.అర్జునరావు, ఎంఈవోలు దివాకరరావు, శేష శైలజ ముఖ్య అతిథులుగా హాజరై బ్రెయిలీ చిత్ర పటం వద్ద నివాళులు అర్పించారు. బొడ్డు సత్యవతి సమకూర్చిన కేక్ కట్ చేసి దివ్యాంగులకు తినిపించారు. అనంతరం అర్జునరావు మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ ఘనతను విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు వివరించారు. బ్రెయిలీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని బంగారు ప్రకాశరావు దివ్యాంగులకు భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసు సీహెచ్ పద్మ, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ఆర్.ప్రియ, భవిత ఉపాధ్యాయులు కుమారి, డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉప్పవరంలో మేలుకొలుపులు

అచ్యుతాపురం: ఉప్పవరంలో ధనుర్మాస మేలుకొలుపులు గురువారం తెల్లవారు జామున నిర్వహించారు. సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో భజనలు చేసుకుంటూ గ్రామంలో సంచరించారు. ఈ కార్యక్రమంలో కొల్లి అప్పారావు,చిన్ని రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

బ్రాండిక్స్ ఉద్యోగులకు నాణ్యమైన ఆహారం



బ్రాండిక్స్ ఉద్యోగులకు ఆహారం వడ్డిస్తున్న అక్షయపాత్ర సిబ్బంది

అచ్యుతాపురం : బ్రాండెక్స్‌లోని ఉద్యోగులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించేందుకు ఎంత ఖర్చుకయినా వెనుకాడడం లేదని బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి తెలిపారు. బ్రాండిక్స్ అపెరల్ పార్కులోని అక్షయపాత్ర కిచెన్ రూమ్‌ను సందర్శించిన ఆయన కార్మికులతో మాట్లాడారు. ఐదు కోట్ల రూపాయల వ్యయంతో ఎకరా స్థలంలో అక్షయ పాత్ర సంస్థ ద్వారా వండే ఆహారాన్ని బ్రాండిక్స్‌లోని అన్ని యూనిట్లకు పంపిస్తున్నామని తెలిపారు. ఆహారం వండుతున్న విధానం, నాణ్యత వంటి అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట అక్షయ పాత్ర ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ భక్త దాస ప్రభు ఉన్నారు.